గ్రామాల్లో చెత్తశుద్ధి ఏదీ?

- వృథాగా గ్రామాల్లోని డంపింగ్ యార్డులు
- సమష్టిగానే చెత్తసేకరణ
- మరుగున పడుతున్న తడి–పొడి చెత్త సేకరణ ప్రక్రియ


నిరుపయోగంగా చెత్త డంపింగ్ యార్డు

రామగుండం: రాష్ట్రప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో రూ.లక్షల్లో నిధులు వెచ్చించి నిర్మించిన చెత్త డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. దీని ముఖ్యోద్దేశం గ్రామాల్లో ప్రతీ ఇంటినుంచి పారిశుధ్య సిబ్బంది తడి–పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉంటుంది. సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులకు తరలిస్తారు. కుళ్లిపోయే స్వభావం గల చెత్తను ఒక అరలో, కాలిపోయే స్వభావమున్న చెత్తను మరో అరలో వేసి పొడిచెత్తలోని ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ నిమిత్తం తరలించి, తడిచెత్తతో కంపోస్ట్ (సేంద్రీయ) ఎరువు తయారుచేసి రైతులకు సరఫరా చేసే కార్యాచరణపై ప్రత్యేక బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. అయినప్పటికీ పలు మార్లు గ్రామాల్లోని శివారు నిర్జన ప్రదేశాల్లో చెత్తను డంపింగ్ చేయడంతో కుప్పలుగా పేరుకుపోతున్నాయి. సేంద్రీయ ఎరువును వినియోగించి నాన్ పెస్టిసైడ్స్ అగ్రికల్చర్ (ఎన్‌పీఏ) రసాయన ఎరువుల అవసరం లేని వ్యవసాయంగా తీర్చిదిద్దాలనే లక్ష్యం మరుగున పడింది. రెండేళ్ల క్రితం ప్రతీ గ్రామంలో తడి–పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతీ ఇంటికి వేర్వేరుగా చెత్తసేకరణకు రెండు ప్లాస్టిక్ డబ్బాలు అందించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు సైతం చెత్తసేకరణ, సేంద్రీయ ఎరువుల తయారీ తదితర అంశాలపై సుదీర్ఘంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాల్లో కోతుల బెడదతో చెత్తను వేర్వేరుగా సేకరించే పరిస్థితి లేకపోవడం,


ట్రాక్టర్‌లో చెత్త తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ప్రజలు వేర్వేరుగా చెత్తను వేయడంలో ఆసక్తి కనబర్చకపోవడం కూడా లక్ష్యానికి తూట్లు పొడిచినట్టిందనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

అవగాహన కల్పించాలి



తడిచెత్తతో ఉత్పత్తి చేసే కంపోస్టు (సేంద్రీయ) ఎరువు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రస్తుతం రసాయన ఎరువుల వినియోగంతో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను ప్రజలకు వివరించాలి. తడి–పొడి చెత్త సేకరణపై పకడ్బందీ కార్యాచరణ చేపడితేనే సత్ఫలితాలు వస్తాయి.

– ఉరిమెట్ల రాజలింగం, మాజీ ఎంపీపీ, ముర్మూర్

ప్రాధాన్యత వివరించాలి



పారిశుధ్య కార్మికులకు తడిపొడి చెత్త ప్రాధాన్యతపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. ఇళ్ల నుంచి చెత్తనుసేకరించే క్రమంలో తడి–పొడి వేర్వేరుగా అందించాలని ఇళ్లలోని మహిళలకు తెలియజేసే అవకాశం ఉంటుంది. కాలనీ కూడళ్లలోని చెత్తకుండీలను తొలగించి ప్రతీరోజు నేరుగా పారిశుధ్య కార్మికులు ఇళ్లనుంచే చెత్త సేకరణ చేపడితే ప్రయోజనం ఉంటుంది.

– సుంకరి రవి, కుందనపల్లి

సమావేశాల్లో వివరిస్తున్నాం



గ్రామసభల్లో తడి–పొడి చెత్త సేకరణ, ప్రయోజనాలు తదితర అంశాలపై వివరిస్తూనే ఉన్నాం. ప్రజల్లో వచ్చే మార్పులతోనే ఇదీ సాధ్యమవుతుంది. ముఖ్యంగా రైతు కుటుంబాలు సైతం తడిచెత్తతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విడమర్చి చెప్పాలి. ప్రతీఇంట్లో రెండు చెత్తడబ్బాలు తడి–పొడి చెత్తకు వేర్వేరుగా ఉండాలి. అప్పుడే సాధ్యమవుతుంది.

– భూక్య యాదగిరి, ఎంపీడీఓ, అంతర్గాం

‘కంటివెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి


సుల్తాన్‌పూర్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

పెద్దపల్లిరూరల్/ఎలిగేడు/సుల్తానాబాద్/జ్యోతినగర్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘కంటివెలుగు’ కార్యక్రమాన్ని పట్టణ, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు తెలిపారు ఈ సందర్భంగా పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో ఎంపీపీ స్రవంతి, సర్పంచ్ స్వరూప, ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌లో ఎంపీపీ స్రవంతి, సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్ ప్రభుత్వ పాఠశాలలోని ఏడో వార్డులో కౌన్సిలర్ కూకట్ల గోపి, రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ గురువారం కంటివెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి నేత్ర వైద్య పరీక్షలుచేసి అవసరమైన వారికి కంటిఅద్దాలు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, నాయకులు పోచాలు, విజయరావు, లక్ష్మణ్, వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ హరీశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మండిగ రాయనర్సయ్య, తాని పర్తిమోహన్‌రావు, డాక్టర్ శ్రీజ, హెచ్ఈఓ శ్రీనివాస్ రెడ్డి ,హెచ్ఎస్ వెంకటరెడ్డి, వైద్యాధికారి చేరాలు, హెల్త్ సూపర్‌వైజర్ సమ్మయ్య, ఏఎన్ఎం సుగుణ, అరుణశ్రీ, వైద్య సిబ్బంది ప్రవళిక, హరీశ్, ఆశావర్కర్స్ లత, రాజేశ్వరి, జయశ్రీ, సానిటరీ సూపర్‌వైజర్ బండారి రవి, మున్సిపల్ ఆఫీసర్ జ్ఞానిశేఖర్, ఆర్పీలు స్వప్న, ధనలక్ష్మీ, అరుణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి


ఎస్ఈ సుదర్శన్‌తో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడలో నిర్మించిన వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సుదర్శన్‌ను గురువారం అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ కలిసి చర్చించారు. దీనిపై ఎస్ఈ సానుకూలంగా స్పందిస్తూ సత్వరమే విద్యుత్ సరఫరా చేయిస్తానని హామీఇచ్చినట్లు తెలిపారు. గోలివాడ సర్పంచ్ ధర్ని రాజేశ్ వెంట ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని పొత్కపల్లిలో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో గురువారం వాహనాలు తనిఖీచేశారు. పొత్కపల్లి మీదుగా సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్ వైపువెళ్లే వాహనాలను తనిఖీచేసి అనుమతి లేని వాహనాలకు జరిమాన విధించారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల దరఖాస్తులపై విచారణ

ఓదెల: మండలంలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిపై ఆర్ఐల ఆధ్వర్యంలో గురువారం విచారణ చేశారు. మండలంలోని 22 గ్రామాల్లో 5వేలకు పైగా డబుల్‌బెడ్రూం మంజూరుకు దరఖాస్తు చేసుకోగా వారి నివాస యోగ్యత విషయాలపై ఆరా తీస్తున్నారు. ఎలాంటి గూడు లేనివారికి మాత్రమే డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తహసీల్దార్ రమేశ్ తెలిపారు.

గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించాలి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో పర్మినెంట్ కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని కార్మికసంఘం నాయకులు కంపెనీ అధికారులను కోరారు. గురువారం హెచ్ఆర్ మేనేజర్ గోవిందరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటివరకు పనిచేసిన యూనియన్ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో తిరిగి కంపెనీలో గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. నాయకులు దాడి మహేశ్, పోతుల ప్రసాద్, సతీశ్, శ్రీనివాస్, రమేశ్, కార్మికులు, అధికారులను కలిశారు.

అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట


దప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వస్తున్న ప్రజలు


విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

రామగిరి: మండలంలోని పన్నూరులో గురువారం శ్రీభూదేవి సహిత బొడ్రాయి, శ్రీమహాలక్ష్మీ విగ్రహాల పునఃప్రతిష్ఠాపన అంగరంగ వైభవంగా సాగింది. పోచమ్మ కొలుపు ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామం నడిబొడ్డున భూలక్ష్మి బొడ్రాయి స్థానంలో నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఐదురోజుల వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో జెడ్పీ చైర్మన్ పుట్టమధు, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జెడ్పీటీసీ మేడరవేని శారద, రైతుబంధు మండల కన్వీనర్ మేడరవేని కుమార్ యాదవ్, వైస్ఎంపీపీ కాపరబోయిన శ్రీదేవి, సర్పంచ్‌లు అల్లం పద్మ, పల్లె ప్రతిమ, గంట పద్మ, ఎంపీటీసీలు చిందం మహేశ్, కొప్పుల గణపతి, ఉపసర్పంచ్ దామెర శ్రీనివాస్ వివిధ పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కమాన్‌పూర్: మండలంలోని పెంచికల్‌పేటలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్ఛరణల మధ్య బొడ్రాయిని ప్రతిష్ఠించారు. ముందుగా బొడ్రాయిని డప్పుచప్పులతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. మహిళల పూనకాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ వెంకటేశ్, ఎంపీటీసీ ఉమ, ఉప సర్పంచ్ లింగాల కుమార్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సుల్తానాబాద్ మండలం పూసాల జెడ్పీహైస్కూల్‌లో భౌతికరసాయన శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సురేందర్ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపికైనట్లు డీఈవో మాధవి తెలిపారు.“దేశం స్వయం సమృద్ధిగా తయారవడానికి వైజ్ఞానిక సంస్కృతిని ప్రోత్సహించడం” అనే అంశంపై నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సుకు సురేందర్ సమర్పించిన పరిశోధనపత్రం ఎంపికైందని డీఈవో పేర్కొన్నారు. ఈనెల 28న రాష్ట్ర విద్యాపరిశోధనా శిక్షణ సంస్థలో జరిగే రాష్ట్రస్థాయి సదస్సులో “నాయొక్క పాఠశాల..నా యొక్క ఆవిష్కరణలు... భవిష్యత్ శాస్త్రవేత్తలు అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పిస్తారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన సురేందర్‌ను డీఈవో, జిల్లా సైన్స్ అధికారి రవినందన్ రావు, హెచ్ఎం శశికాంత్‌రెడ్డి అభినందించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణశ్రీ తెలిపారు. మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఒక సెల్‌నంబర్‌తో ఒక దరఖాస్తుకు మాత్రమే వీలుంటుందన్నారు. ఇతర విద్యార్థుల ఫోటోలు పెట్టి దరఖాస్తు చేసినవారిపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏప్రిల్ 23న ఎంపిక చేయబడిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు హెల్ప్‌లైన్ 180042545678లో సంప్రదించాలని కోరారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న నాయకులు

జూలపల్లి: నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కుమ్మరికుంట సర్పంచ్ మేచినేని సంతోశ్‌రావు అన్నారు. మండలంలోని కుమ్మరికుంటకు చెందిన నిరుపేద సుంకెమల్లేశం కూతురు రజిత ఇటీవల అనారోగ్యానికి గురై జిల్లాకేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందగా సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.73వేల చెక్కును గురువారం ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశంతో కలిసి అందించారు. ఈ సందర్భంగా నిధులను మంజూరు చేయించిన పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కుంట రాజేశ్వర్‌రెడ్డి, గడ్డం రాజేశర్‌రెడ్డి గ్రామస్తులు ఉన్నారు.

క్లుప్తంగా

దళితబంధు యూనిట్ ప్రారంభం


యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండలకేంద్రంలో దళితబంధు యూనిట్‌ను మంత్రి కొప్పుల ఈశ్వర్, జెడ్పీచైర్మన్ పుట్టమధు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘాల జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ఎంపీపీ మెడవేని తిరుపతి, ఉపసర్పంచ్ ఆవుల లత, సెర్ప్ ఏపీఎం తులసీమాత, అపర్ణ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: మండలంలోని తుర్కలమద్దికుంటలో గురువారం పోచమ్మ ఆలయనిర్మాణం పనులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామస్తుల సహకారంతో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేస్తామని సర్పంచ్ జయప్రద, వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య తెలిపారు. నాయకులు శ్రీనివాస్, చాంద్, ఆలయచైర్మన్ గోపాల్‌రెడ్డి, మల్లేశ్, సురేశ్, నర్సింగ్ కిష్టయ్య, సల్లు, సత్యనారాయణ, రాంచంద్రారెడ్డి, ముత్యాలరాము, స్వామి, రాజేశం, తిరుపతి, లక్ష్మి, వెంకటి తదితరులున్నారు.

గాయత్రీలో ‘రైమ్స్‌ఫెస్ట్’



నృత్యం చేస్తున్న చిన్నారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్‌లో గురువారం ప్రీప్రైమరీ విద్యార్థులతో నిర్వహించిన ‘రైమ్స్‌ఫెస్ట్’ కార్యక్రమం చూపరులను ఆకట్టుకుంది. రైమ్స్‌కు తగ్గట్టుగా చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. చిన్నారుల్లో మానసికోల్లాసం కల్పించడంతో పాటు రైమ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈకార్యక్రమం నిర్వహించినట్లు కరస్పాండెంట్ అల్లెంకి రజనీ తెలిపారు. విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియొద్దీన్ తదితరులున్నారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారం


అదనపు ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్: పట్టణంలో లో వోల్టేజీ సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులపై ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని సుగ్లాంపల్లి కాలనీలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎమ్మెల్యే దృష్టికి కౌన్సిలర్ మమత తీసుకెళ్లడంతో స్పందించారు. ఈ సందర్భంగా గురువారం విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. ఎమ్మెల్యే దాసరికి కౌన్సిలర్ మమతకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ శంకర్‌గౌడ్

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో సింగరేణి నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు గురువారం సర్పంచ్ బొల్లపెల్లి శంకర్‌గౌడ్, సింగరేణి అధికారులు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయం, బీరన్న ఆలయం వద్ద బోర్లు, ముల్కలపల్లి వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటుకు శంకుస్థాన చేశారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు పద్మరాజు, షఫీ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత

జ్యోతినగర్: నిరుపేద కుటుంబాలకు విజయమ్మ ఫౌండేషన్ అండగా నిలుస్తుందని మూడో డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ అన్నారు. గురువా రం మూడో డివిజన్ మేర కాలనీకి చెందిన రామిళ్ల అరుణ–సదానందం కూతురు సౌమ్య నిరుపేద యువతి వివాహం ఈనెల 24న నిర్వహిస్తుండగా ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తె, మెట్టెలను అందించినట్లు తెలిపారు. విజయమ్మ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ ఎడెల్లి శ్యామ్, సిద్దుతో పాటు పలువురు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌ను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

జూలపల్లి: గ్రామాల్లో చేపట్టే స్వచ్ఛభారత ఫేజ్ 2ను పనులను అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి విజయవంతం చేయాలని ఎంపీపీ రమాదేవి సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛభారత్ ఫేజ్ 2 మూడు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం, పెంచేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, డీఆర్‌డీఏ జిల్లా కోఆర్డినేటర్ రాఘవులు, ఎంఐఎస్ రేణుక, ఏఈ సువిశాల, ఏవో ప్రత్యూష, ఈజీఎస్ ఏపీవో సదానందం వెలుగు సమాఖ్య ఏపీఎం సుధాకర్, సర్పంచులు నర్సింహయాదవ్, రాజయ్య, పద్మశ్యాం, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, మహిళా సంఘాల సీఏలు పాల్గొన్నారు.

బొట్లవనపర్తిలో బీజేపీ స్ట్రీట్‌కార్నర్ సమావేశం


మాట్లాడుతున్న సూర్యనారాయణ

ధర్మారం: మండలం బొట్లవనపర్తిలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు యాళ్ల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో స్ట్రీట్‌కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నాయకులు సర్పంచు కొమ్ము రాంబాబు, బీజేపీ దళితమోర్చా అధికార ప్రతినిధి కాడే సూర్యనారాయణలు హాజరై మాట్లాడారు. పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని కోరారు. గ్రామాల్లో పార్టీని పటిష్టం చేసి వచ్చే ఎన్నికలల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి సందనవేని లక్ష్మణ్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి కర్రె లక్ష్మణ్, బూత్‌కమిటీ అధ్యక్షుడు తూడి సంపత్, నాయకులు ఇమ్మడిశెట్టి శంకరయ్య, మిట్ ప్రశాంత్, సామంతుల అంజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గోదావరిఖని పీజీ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించడంపై కళాశాల అధ్యాపక బృందం గురువారం హర్షం వ్యక్తం చేశారు. 2023 శాతవాహన ఆరోహణ కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల్లో విద్యార్థులు బహుమతులు సాధించారు. రోల్‌ప్లే విభాగంలో సీహెచ్.రమేశ్ ప్రథమ, రాహుల్ ద్వితీయ, బిజినెస్ క్విజ్‌లో రమ్య, ఆఫ్రిన్, నవీన్ బృందం గెలుచుకున్నారు. అర్థశాస్త్ర విభాగంలో సాగరిక, సుచిత్ర, శాతవాహన నేత విభాగంలో సాయితేజ బహుమతులు సాధించారు. యూనివర్సిటీ స్థాయిలో బహుమతులు సాధించడంపై ప్రిన్సిపాల్ రమాకాంత్, అధ్యాపకులు సురేశ్‌కుమార్, డా.రవిప్రసాద్, సావిత్రి, సల్మా సుల్తానా, రమేశ్‌రెడ్డి, అజయ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

వీసంపేటలో ఆయిల్‌పామ్ సాగు ప్రారంభం


ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న రైతులు

రామగుండం: అంతర్గాం మండలపరిధిలోని వీసంపేట గ్రామంలో గురువారం ఆయిల్‌పామ్ సాగు ప్రారంభించినట్లు ఉద్యానవనశాఖ అధికారి జక్కుల శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన బర్పటి సత్తయ్య 4.10 ఎకరాల విస్తీర్ణంలో 200 మొక్కలు నాటించామన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో పాటు మూడేళ్ల పాటు అంతరపంటలుగా ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. నాలుగో ఏడాది నుంచి ఆయిల్‌పామ్ ఉత్పత్తితో రైతులకు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ పనుల్లో ఏఈఓ రమేశ్, ఫీల్డ్‌అసిస్టెంట్ బర్పటి సురేశ్ తదితరులున్నారు.

మొక్కల సంరక్షణకు బోర్‌వెల్ ఏర్పాటు


బోర్‌వెల్ ప్రారంభిస్తున్న ఎంపివో, సర్పంచ్

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాలోని మెగా పల్లెప్రకృతివనంలో మొక్కల సంరక్షణకు నూతనంగా ఏర్పాటుచేసిన బోర్‌వెల్‌ను మండల పంచాయతీ అధికారి షబ్బీర్‌పాషా ప్రారంభించారు. వేసవి దృష్ట్యా పల్లెప్రకృతివనంలోని మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలతో నూతనంగా బోర్‌వెల్ నిర్మించామన్నారు. పంచాయతీ పాలకవర్గం మోటార్ ఏర్పాటుచేసి మొక్కలకు నీరందించే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ బదావత్ రాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వార్డుసభ్యులు శారద, శ్యాముల్, సమ్మక్క సన్నీ గ్రామస్తులు పాల్గొన్నారు.

సమష్టి పోరాటాలకు రజకసంఘాలు సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంపత్

రామగిరి: సమస్యల పరిష్కారానికి రజకసంఘాలు సమష్టి పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రజకసంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ పిలుపునిచ్చారు. రామగిరి మండలం సెంటినరీకాలనీ, రాంనగర్, పన్నూరు గ్రామాల్లో గురువారం నిర్వహించిన పునర్నిర్మాణ ఉద్యమ సదస్సులో పాల్గొని మాట్లాడారు. రజకుల పట్ల రాష్ట్రప్రభుత్వం సవతి ప్రేమ చూపుతోందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రజకుల సంక్షేమానికి రూ.59కోట్లు కేటాయించినట్లు ప్రకటించడం కేవలం కాగితాలకే పరిమితమైందన్నారు. రజకులకు ఉచితంగా 250 యూనిట్ల కరెంట్ అందిస్తున్నామని చెబుతూనే బిల్లులు కొడుతున్నారన్నారు. రాంనగర్‌లోని దోభీఘాట్ కూల్చివేయడం దుర్మార్గమని, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సహకారంతో దోభీఘాట్ పునర్నిర్మాణం చేపడతామన్నారు. రజకులను ప్రభుత్వ ప్రత్యేక కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో సంత్ గాడ్గే బాబా విగ్రహాన్ని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి లక్ష్మణ్, సెంటినరీకాలనీ గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి రాయమల్లు, మండలఅధ్యక్షుడు పున్నం సమ్మయ్య, నాయకులు చెలికట్ల మల్లేశ్, ఓదెలు, లింగయ్య, రవి మొండయ్య, జాలిగం శ్రీను పాల్గొన్నారు.

25నుంచి హరిహరాలయ మహోత్సవాలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల పునరావాస కాలనీలో నిర్మించిన శ్రీహరిహరాలయ దివ్య విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు ఈనెల 25 నుంచి ఐదు రోజులు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఎదులాపురం నీరజ తెలిపారు. ఈనెల 25న తొలిరోజు కలశ స్థాపన, 26న మహా లింగార్చన, 27న ఛండీ పారాయణం, 28న మహా సుదర్శన, మహా ఛండీయాగం, మార్చి ఒకటిన దేవతామూర్తులకు కుంకుమార్చన, మార్చి 2న శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని సర్పంచ్ కోరారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.